క్లుప్తంగా

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

నాగర్‌కర్నూల్ రూరల్: సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధ్యమని ఉద్యానవన శాస్త్రవేత్త ఆర్.బాను పేర్కొన్నారు. శనివారం మండలంలోని గన్యాగుల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. రసాయనిక ఎరువులు, మందులు మోతాదుకు మించి వాడొద్దన్నారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడితే భూసారం, పంట దిగుబడి తగ్గుతోందన్నారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. విత్తనాలు, మందులు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రశీదు పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీశైలం, మాజీ సర్పంచి విజయరెడ్డి, మాజీ ఎంపీటీసీ బాల మల్లయ్య, పశు వైద్యాధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవి శంకర్ నాయక్ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో బ్రిడ్జి కోర్స్ ప్రత్యేక శిక్షణ పొందుతున్న 15 మంది ఎంఎల్‌హెచ్‌పీలకు స్టడీ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. స్త్రీ వైద్యనిపుణులు డాక్టర్ సుప్రియ, పీడియాట్రిక్ డాక్టర్ ఎస్. రాజేష్ గౌడ్, వైద్యాధికారి డాక్టర్ పి.మానస, ఎంపీహెచ్‌ఈఓలు కటకం విజయ్ కుమార్, బాదం రాజేష్, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ చింతపట్ల నీరజ్ కుమార్, టి.యాదగిరి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఆంక్షలు వద్దు



కల్వకుర్తి రూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఆంక్షలు విధించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనలు వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఏకకాలంలో ఇవ్వాలన్నారు. 60 గజాల స్థలంలో కట్టుకుంటేనే బిల్లులు ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన ఏ హామీ సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి ఆంజనేయులు, సి ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, పరశురాములు, బాల్‌రెడ్డి, బాలస్వామి, శివ రాములు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి



వెల్దండ: రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అని ఏఈఓలు సురేష్‌గౌడ్, గణేష్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెద్దాపూర్, వెల్దండ, చొక్కన్నపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాపాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌తీసుకొని రావాలన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపడుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

క్రీడలతో దేహదారుఢ్యం

కల్వకుర్తి రూరల్: క్రీడలతో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని కల్వకుర్తి ఎస్‌ఐ మాధవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మార్చాలలో ఎంపీఎల్-4 క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ప్రవీణ్ ఫైటర్‌పై శివరాం బుల్లెట్ గెలుపొందింది. విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు, గ్రామ పెద్దలు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ పండుగ

తిమ్మాజిపేట: మండలంలోని బావాజిపల్లి గ్రామంలో శనివారం కోట మైసమ్మ పండుగను నిర్వహించారు. మహిళలు, బైండ్ల వారు బోనాలు ఎత్తి గ్రామంలో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ పెద్దలు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేయూత

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు ఆర్ట్ ఆఫ్ గివింగ్, స్వామి వివేక సేవ బృందం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు దుప్పట్లు శనివారం అందించారు. నైబర్ గుడ్ అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సేవ బృందం సభ్యులు తెలిపారు. లక్ష్మీనరసింహ, మణిదీప్, ధనుష్, అభిరామ్, వంశీ, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డా. రవికుమార్

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని ఇన్‌చార్జ్ జిల్లా వైద్యాధికారి డా. రవికుమార్ అన్నారు. శనివారం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం కచ్చితంగా రక్తపోటు స్థాయిని తెలుసుకొని అదుపులో ఉంచుకొని ఆరోగ్య జీవిత కాలాన్ని పెంచుకోవాలని సూచించారు. రక్త పోటు అదుపులో ఉండటంతో గుండె, మూత్రపిండాల వైఫల్యం, పక్షవాతం బారిన పడతారని, ఎలాంటి లక్షణాలు లేకుండానే శరీరంలోని మెదడు, కళ్లు, గుండె, రక్తనాళాలు, మూత్రపిండాలు తదితర అవయవాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి ధ్యానం, యోగాలాంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డా. కృష్ణమోహన్, వైద్యాధికారి డా. వాణి, డీపీఓ రేణయ్య, ఎన్‌సీడీ నోడల్ పర్సన్ విజయ్‌కుమార్, మల్లేష్, డీపీఎంఓ సుకుమార్‌రెడ్డి, ఏఎంఓఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి

బిజినేపల్లి: ప్రతి ఒక్కరు రక్తపోటును అదుపులో ఉంచుకోవాలని జిల్లా హెల్త్ అసిస్టెంట్ కూన గోవర్ధన్ కోరారు. మండలంలోని పాలెంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటుపై అవగాహన కల్పించారు. ప్రతినెల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎన్‌ఎంలు గజవర్ధనమ్మ, మల్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, డీఈఓ రమేష్‌కుమార్

కందనూలు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో శనివారం డీఈఓ రమేష్‌కుమార్‌తో కలిసి బడిబాట కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ఉచితంగా మధ్యాహ్నభోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తుందన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్‌కుమార్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతారంలో బడిబాట

తాడూరు: మండలంలో అంతారంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. శనివారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగారు. ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలను వివరించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు.

‘అసత్య వార్తలు నమ్మొద్దు’

మన్ననూర్: అసత్య వార్తలు ఎవరు నమ్మొద్దని చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య పేర్కొన్నారు. శనివారం మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలోని బస్టాండ్ ఆవరణలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చెంచులు వెనుకబాటుకు గురైన మాట వాస్తవమే కాని ఈ రెండేళ్లలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో 770 మంది మృత్యువాత పడ్డారనడంలో ఎంత మాత్రం వాస్తవం కాదన్నారు. ఓ పత్రికలో అవాస్తవాలు ప్రచురితం అయ్యాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చెంచుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, శంకరయ్య, మాజీ సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వీటీడీఏ అధ్యక్షుడు కోటయ్య, వెంకటయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్ రూరల్: గిరిజనుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గేమ్యా నాయక్ తండా, ముక్కిడిగుండం, గిరిజనులతో ఆయన సమావేశం అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలను చేశారు కాని నిధులు కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులేక అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కార్యక్రమంలో గిరిజనులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి



కోడేరు: తరుగు పేరుతో మోసాలు పాల్పడుతున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నాగులపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుగు పేరుతో రైతులను నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. వెంటనే డీఆర్‌డీఏ పీడీ, జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శివశంకర్, కార్తిక్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మృతితో అనాథలైన చిన్నారులు



వెల్దండ: మండలంలోని మర్రి గుంతతండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తతండాకు చెందిన ఇస్లావత్ భాస్కర్(38) ఈ నెల 13న అచ్చంపేట మండలం సిద్దాపూర్‌లో బావిలో పడి మృతిచెందాడు. ఈనెల 11న పని నిమిత్తం మిత్రులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. ఆరోగ్యం సరిగ్గా లేదని భాస్కర్ ఇంటికి బయలు దేరాడు. గ్రామానికి తోటి మిత్రులు చేరుకున్నా భాస్కర్ రాకపోవడంతో కుటుంబసభ్యులు కంగారు పడ్డారు. ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. 13న సిద్దాపూర్‌లో బావిలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైనట్లు సమాచారం వచ్చింది. అనుమానం వచ్చి శవంకు ఏమైన ఆనవాళ్లు ఉన్నాయని అక్కడి పోలీసులను అడిగి తెలుసుకున్నారు. శనివారం వెళ్లి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న గుర్తు తెలియని శవంను పరిశీలించారు. భాస్కర్‌గా కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో పోలీసులు శవాన్ని బాధిత కుటుంబసభ్యులు అప్పగించారు. ఎనిమిదేళ్ల కిందట భాస్కర్ భార్య ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందడంతో పిల్లలు అభిరామ్, సాయిరామ్‌లు అనాథలయ్యారు. కుటుంబసభ్యులు రోదనలు మిన్నంటాయి.

కనీస వసతులు కల్పించాలి

కోడేరు: ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నడుస్తున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఆయన సందర్శించారు. పర్వతాలు, వెంకటయ్య, జ్యోతి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

తాడూరు: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి సూచించారు. శనివారం సింగిల్‌విండో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఇప్పటివరకు ధాన్యం ఎంత సేకరించారో చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతు కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యం నాణ్యతతో ఉండాలని కోరారు. ప్రభుత్వం సన్నాలకు క్వింటాల్‌కు రూ.500ల బోనస్ ఇస్తుందన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

నల్లమల సమస్యలపై సీఎం స్పష్టత ఇవ్వాలి

మన్ననూర్: నల్లమల సమస్యలపై సీఎం స్పష్టత ఇవ్వాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల ప్రాంతానికి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రానుండడం సంతోషకరమన్నారు. ఆదివాసీ చెంచుల అభివృద్ధి కోసం ఇందిర సౌర గిరి జల వికాస పథకం అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ప్రారంభించనుండడం శుభ పరిణామం అన్నారు. చెన్నకేశవ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని, నల్లమల ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోలి రాజు, నీల రవి, నోముల శంకర్ గౌడ్, బట్టి పరమేష్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల శ్రమ దోపిడీని అడ్డుకుందాం

అచ్చంపేట రూరల్: శ్రామికుల శ్రమ దోపిడీ అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలనర్సింహ అన్నారు. శనివారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు దేశంలోని అట్టడుగు వర్గాలకు అండగా ఉంటుందన్నారు. అనంతరం సీపీఎం పార్టీ నుంచి పలువురు సీపీఐలో చేరారు. కార్యక్రమంలో పర్వతాలు, శేఖర్‌రెడ్డి, గణేశ్, కేశవులుగౌడ్, శ్రీనివాసులు, అశోక్‌గౌడ్, పరశురాములు, శివశంకర్, ప్రేమ్‌కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

‘మన కుటుంబం’ సినిమాను ఆదరించండి

వెల్దండ: పల్లెటూరి నేపథ్యంలో తెరపై వచ్చిన ‘మన కుటుంబం’ సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని సినీ నిర్మాత కలకొండ నరసింహులు, సినీ హీరో రవివర్మలు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు పట్టణం వెంకటేశ్వర సినిమా థియేటర్లో సినిమాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవన స్థితిగతులు, పల్లెటూరి నేపథ్య కోణంలో సినిమాను తెరకెక్కించినట్లు తెలిపారు. దుర్గయ్య, మొగులయ్య, మల్లెపల్లి జగన్, యాదగిరి, తదితరులు ఉన్నారు.

పోలీసుస్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పెంట్లవెల్లి: మండల కేంద్రమైన పెంట్లవెల్లి గ్రామ సమీపంలోని 123 సర్వే నంబర్‌లోగల ఉన్న స్థలాన్ని శనివారం స్థానిక సీఐ మహేష్, ఎస్‌ఐ రామన్‌గౌడ్, మండల సీనియర్ నాయకులు రామన్‌గౌడ్‌లు పోలీస్ స్టేషన్ భవనానికి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, శేషంద్రప్రసాద్, ఆర్‌ఐ బాలకిషన్ పాల్గొన్నారు.



పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీబీ తండా ఆదివాసి చెంచు రైతులు

మన్ననూర్: వారసత్వంగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించి ఆదివాసి చెంచులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. శనివారం స్థానిక విలేకరులతో సీబీ తండా ఆదివాసి చెంచులు మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సీబీ తండాకు చెందిన 16 కుటుంబాలకు చెందిన చెంచులు సుమారు 40 ఏళ్లుగా 43 ఎకరాల పోడు భూమిని సాగు చేసుకుంటూ అక్కడే గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నామన్నారు. గతేడాది నుంచి భూములు సాగు చేయొద్దని అటవీశాఖ అధికారులు మాపై దాడులు చేసి మా గుడిసెలు దగ్ధం చేశారని వాపోయారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇవ్వడంతో పాటు పండ్ల తోటలు సాగు చేసి అభివృద్ధి దిశగా ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఆదివాసి చెంచులకు కూడా ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి సరైన న్యాయం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావ, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెంచులు శంకరయ్య, సత్యనారాయణ, చంద్రయ్య, వెంకటమ్మ, లింగమ్మ పాల్గొన్నారు.

అధికారులు తీరు మార్చుకోవాలి : ఎంపీ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

బిజినేపల్లి: తెలంగాణ ప్రభుత్వం రైతుల నుంచి యాసంగి వరి ధాన్యం కొనుగోలుకు అన్ని వసతులు కల్పిస్తే.. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తూ ధాన్యం కొనకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తీరును మార్చుకోవాలని ఎంపీ మల్లు రవి సూచించారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరణలో ఇబ్బందులు కలిగిస్తున్నారన్న ఫిర్యాదుల మేరకు శనివారం సాయంత్రం ఆయన నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని సమీక్షించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ సకాలంలో జరగడం లేదని, గన్నీ బ్యాగులను ప్రభుత్వమే అందిస్తుంటే నింపడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్రాల వద్ద ధాన్యం తరలింపునకు రైతుల వద్ద డబ్బులు వసూలు చేసే వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల నుంచి మరోమారు ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, మిద్దె రాములు, కత్తె ఈశ్వర్, నసీర్ పాల్గొన్నారు.

కల్వకుర్తి అభివృద్ధిపై వివక్ష తగదు



కల్వకుర్తి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి అభివృద్ధిపై వివక్ష చూపుతున్నారని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విమర్శించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతంపై సవతి తల్లి ప్రేమ చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కల్వకుర్తిలో ట్రామా సెంటర్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 19న జిల్లా పర్యటన కు వస్తున్న సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలన్నారు. నాయకులు పుట్ట రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడమ సత్యం, షాహిద్, సింగం విజయ్ గౌడ్, కొండూరు గోవర్ధన్, సూర్య ప్రకాష్ రావు, వెంకటేశ్వరరావు, మనోహర్ రెడ్డి, జంగయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన గణేష్‌కు ఇష్టం లేని పెళ్లి నిశ్చయం అయ్యింది. ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరో ఘటనలో..

పెద్దకొత్తపల్లి మండలం మారేడుమాన్‌దిన్నే గ్రామానికి చెందిన మహేష్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటూ డెకరేషన్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాల్ పోస్టర్ విడుదల



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో శనివారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం పోస్టర్‌ను విడుదల చేశారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత అధ్యక్షతన హైదరాబాదులో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో అస్తిత్వం, తాత్వికత, జీవన విధానం, చరిత్ర, భాష, ఉద్యమం అనే అంశాల పైన ఇవ్వ కవులు, కవయిత్రులు 35 సంవత్సరాల వయసు లోపు ఉన్న వారికి తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో కవితలను వినిపించేందుకు యువ కవి సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంజుల, షకీల్, నారాయణ, నరేష్, శ్రీవాణి, రవి, మహేష్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల పోరాట ఫలితమే కులగణన

కందనూలు: బీసీ సంఘాల పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పిడికిల్ల శ్రీనివాసులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ప్రైవేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభలలో 50% రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పెద్దయ్య యాదవ్, ఉమ్మడి పాలమూరు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గంగోజి, మౌలానా, ఉప్పనమోని సైదులు, నేష లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు



అచ్చంపేట రూరల్: మండలంలోని పులిజాలలో బొడ్రాయి, దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు ఆలయం వద్ద హోమాలు నిర్వహించారు. ఉదయం గవ్యాంతపూజలు, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, పరివార పూజలు, లక్షణోద్ధారణ, గ్రామ ప్రదిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి. అంతకుముందు కోట మైసమ్మ విగ్రహ పున: ప్రతిష్ఠాపన, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్రన్యాసం వంటి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమామహేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, నారాయణరెడ్డి, జంగాచారి, రామాచారి, శేఖరాచారి, రవీందర్‌రెడ్డి, చెన్నారెడ్డి, రమేష్, తిర్పతయ్య, మహిళా భక్తులు ధనమ్మ, జ్యోతి, జగదాంబ పాల్గొన్నారు.

ఈర్ల నర్సింహకు ఘన నివాళి

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండ గ్రామంలో సీపీఐ రాష్ట్ర నాయకుడు ఈర్ల నర్సింహ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్తూపం వద్ద నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఈర్ల చంద్రమౌళి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బ్రహ్మాచారి, ఈర్ల గంగాధర్, ఈర్ల భూపేష్‌బాబు, శ్రీకాంత్, వేమన, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో జాతీయ ఉపాధి హామీ పనులను ఏపీఓ ఈశ్వర్‌జీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు కూలి రూ.300 డబ్బులు వస్తాయన్నారు. వేసవి కావడంతో కూలీలు ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు పనులు పూర్తి చేసుకోవాలన్నారు. జాబ్‌కార్డులు లేనివారు ఒకరి బదులు మరొకరు వెళ్లకూడదన్నారు. ప్రతివారం కూలీల మస్టర్లను ఆన్‌లైన్ నమోదు చేయించాలన్నారు. అనంతరం నర్సరీలలో మొక్కలను పరిశీలించారు. అనంతరం కూలీలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి పద్మ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

గోవుల వాహనాలు పట్టివేత

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ వద్ద శనివారం గోవులను తరలిస్తున్న బొలేరో వాహనాలను ఎస్‌ఐ కురుమూర్తి పట్టుకున్నారు. అచ్చంపేట నుంచి హైదరాబాదు వైపు రెండు బొలెరో వాహనాల్లో మొత్తం 16 పశువులు తరలిస్తున్నారని పక్క సమాచారంలో కొట్రగేట్ వద్ద చెక్‌పోస్టు వద్ద వాహనాలను పట్టుకున్నారు. పశువులను మండలంలోని కర్రెవానిపల్లిలోని గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. బోలేరా వాహన డ్రైవర్లు అమీరుద్దీన్, సోహెలొద్దీన్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి పేర్కొన్నారు.

‘రాహుల్‌గాంధీని అడ్డుకోవడం అప్రజాస్వామికం’



కొల్లాపూర్‌లో నిరసన తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కొల్లాపూర్: బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యటనను జేడీయూ, బీజేపీ ప్రభుత్వాలు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బిహార్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వహీద్ మాట్లాడారు. రాహుల్‌గాంధీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కేంద్రం భయపడుతోందన్నారు. అక్రమ కేసులకు భయపడమన్నారు. త్వరలో జరగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు బింగి మహేష్‌యాదవ్, నాగబాబు, జగన్మోహన్‌యాదవ్, శ్రీనివాసులు, కడ్తాల శివశంకర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: బిహార్‌లో రాహుల్ గాంధీ పర్యటనను అడ్డుకోవడంతో శనివారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్, అసెంబ్లీ అధ్యక్షుడు తిరుపతి, శ్రీకాంత్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.